# దెయ్యం

మాధవి



**బార్‌**లో నిశ్శబ్దంగా వుంది. నాతోపాటు కలిసి నల్గురు మాత్రమే వున్నారు. నా మిత్రులు తాగటంలో మునిగి పోయారు. కొంసేపు పేపటికి వాళ్ళకి విసుగు వేసింది.

"ఒరేయి రఘూ...ఏమైనా కథచెప్పరా" అన్నాడు శేఖర్.

"నేనా, నేనేమి కథ చెప్పగలను" అన్నాను సిగరెట్టు వెలిగిస్తూ.

"కాదు నీవు కథలు చెప్పటములో ప్రసిద్ధి– పైగా పెద్ద రచయితవి. చెప్పరా నాయన ప్రతిసలాడించుకోకుండా" గజా–ను ఖాళీచేస్తూ.

మిగిలినవాళ్ళు సపోర్టు చేశారు.

"అయితే చెబుతాను వినండి" అంటూ సిగరెట్టు వెలిగించాను. ఏదో జ్ఞాపకం వస్తోంది. నేను నెమ్మదిగా గతంలోకి జారి పోయాను. నా పెదవులు ఏదోచెబుతున్నాయి.

"మా వూళ్ళో మల్లి అనే పిల్ల వుండేది. ఆ అమ్మాయికి జడగంటలు వుండేవి. మల్లి పట్టుపరికిణి మీద తెల్ల వాయిల్ వోణి వేసుకొనేది. తలలో ఎప్పుడు పూలువుండేవి. ఆ అమ్మాయి చక్కని చుక్క. ఆ చుక్కకి నేను మనసు ఇచ్చాను. మల్లి రోజూ గుడిలో పాటలు పాడేది. ఆ పాటలు వినటానికి ఆ గ్రామము ఎంతో సంబర పడేది. నేనంటె ఎంతో ఇష్టం మల్లికి. ఒకరోజు మల్లి దారికి అడ్డంగా నిల్చేను. మల్లి ... నాతో ఏదైనా మాట్లాడితేనే వెళ్ళనిస్తాను.

**పో** బాబు మీతో నాకేం మాటలు అంది సిగ్గుపడుతూ. అలా సిగ్గుపడుతున్న ఆమెని దగ్గరికి తీసుకొని వదిలి వేశాను. రోజు రోజు నాకు మల్లితో స్నేహం ఎక్కువ అయింది. మల్లిని చూడందె నేను వుండ లేను. మల్లి నాకు ప్రాణం. ఆ రోజుల్లో రెడ్డిగారి అబ్బాయి శంకరము పట్నం నించి వచ్చాడు. మల్లి మీద అతను కన్ను వేయటం గమనించాను. రబ్బరు బొమ్మ లాంటి మల్లి, ఎప్పుడు అందరితోటి కలిసి మెలిసి నవ్వుతు తుళ్ళుతు తిరిగె మల్లి మీద అతని కన్ను పడటము సహజమే అనుకున్నా.

ఆ తరువాత నాకు బాంబేనుంచి మంచి జాబ్ వచ్చింది. అదృష్టం కలిసి వచ్చింది అనుకున్నాను. వెళ్ళిపోయాను." అని కాసేపు ఆగేను. సిగరెట్ పొగ వదులుతు అందరి వంక పరిశీలనగా చూశాను. నేను ఏమి చెబుతానా అని వాళ్ళు కుతూహలంగా చూస్తున్నారు. తిరిగి మొదలుపెట్టాను.

"రెండుసంవత్సరాలు పట్నంలోగడిపాను. తిరిగి మా వూరు బయలుదేరాను. అప్పటికే చీకటి పడింది. పల్లెటూరు కావటంతో ఆ వూరుకి లైట్సు లేవు. ఆ చీకటిలో బస్సు దిగి వేగంగా పొలాల మధ్యగా నడవ సాగాను. ఎటు చూసిన చిక్కని చీకటి ప్రక్కనే పొలాలు. ఇంతలో 'రఘు' అనే పరిచయమున్న గొంతు వినిపించింది. నేను వులిక్కిపడ్డాను. ఆ చీకట్లో మల్లి ఎందుకు వుందో అర్థం కాలేదు. అయినా ఇన్నాళ్ళకి కలుసుకున్న నా ప్రియురాలు గొంతువిని ఆనందముతో పులకరించాను.

దూరంగా గబ్బిల శబ్దం వినిపిస్తోంది. బాగ్ కిందపెట్టి మల్లి అనే కేకవేశాను. వస్తున్నా రఘు అనే మాటలు వినిపించాయి. మల్లి వస్తున్నది. ఇదివరకులాగా పరికిణీలు కట్టలేదు. తెల్లని చీర, తెల్లని జాకెట్టు విరబోసివున్న జుట్టు. ఆమెను చూసి నేను జంకెను. ఆమె నా బాగ్ పుచ్చుకొని దొర గారికి ఇన్నాళ్ళకి జ్ఞాపకం వచ్చానా అయినా పట్నం ఆడపిల్లల్ని చూస్తే మల్లి ఏం జ్ఞాపకం వస్తుంది. అని గునుస్తూ నడుస్తోంది."

నేను నవ్వి "లేదు మల్లి. ఆ శ్రీరామ చంద్రుడికి సీత ఎలాగో నాకు కూడ నీవు ఒక్కదానివే" అని ఆమె భుజాల చుట్టూర చేతులు వేశాను. ఆమె వులిక్కిపడింది.

"నన్ను పెళ్లి చేసుకుంటావా?"

"పిచ్చివాడా! ఇంతకథ జరిగాక నిన్ను పెళ్లి చేసుకోకుండా ఎలాగువుంటాను" అని

"అయినా ఏమిటి ఈ అవతారము. ఆ తెల్ల చీర ఏమిటి నీలాంటి చిన్న పిల్లకి" అని ముహం చిటించుకున్నాను దానికిజవాబుగా మల్లి విరగబడి నవ్వింది ఇంతలో ద్వారి వెలుపలికి వచ్చాము.

"చూశావా మల్లి! నీతో కబుర్లు చెబితె నాకు కాలమే తెలియదు" అని చిన్నగా నవ్వేను.

"సర్లే. అదిగో మీ యిల్లు వస్తోంది" అని పిలుస్తున్నా వినిపించుకోకుండా పరిగెడుతూ మాయం అయింది.

మా ఇంట్లో అందరు నన్ను చూసి ఆశ్చర్యపోయారు. తరువాత ఆనందపడ్డారు. నేను జరిగిన కథ అంతా చెప్పాను. అందరు వులిక్కి పడ్డారు.

"మల్లి...మల్లి చనిపోయింది" అన్నాడు నాన్న.




"ఆ...!" అని ఆశ్చర్యపోయాను.

"అవునురా! ఒకరోజు శంకరం చెరిచాడు ఆ అవమానం భరించలేక ఆమె బావిలోపడి చనిపోయింది.. చాలా మంచి పిల్లరా ఆ అమ్మాయి."

"అయితే నాతో వచ్చింది మల్లి దెయ్యమా!" అని అన్నాను. సిగరెట్ వెలిగిస్తూ అందరి వంక చూశాను.

అందరూ విచారుగా అయి నా వంక చూడసాగేరు.

---

# ఆంధ్రపత్రిక
# సిద్ధార్థి నామ సంవత్సరాది సంచిక

## మనవి

ఎప్పటిలాగే ఆంధ్రపత్రిక ఉగాది సంచిక (సిద్ధార్థి నామ సంవత్సరాది సంచిక) కి తమ రచనలు పంపవలసిందిగా రచయిత (త్రు) లకి మనవి చేసుకుంటున్నాము.

రచనలు జనవరి ఆఖరిలోగా మాకు చేరేట్లు పంపాలని కోరుకుంటున్నాము.

కవరుమీద, వ్రాత ప్రతిమీదకూడా స్పష్టంగా "ఉగాది సంచిక"కి అని రాయాలని మనవి చేసుకుంటున్నాము.

సంపాదకుడు.